క్లుప్తంగా

పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు

ఫిరంగిపురం: గ్రామంలోని ప్రతి వీధిలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచి మేడాబాబు అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యసిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

సిరిపురంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మేడికొండూరు: మండలంలోని సిరిపురంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నవధాన్యాలు, పప్పుదినుసులు, చిరుధాన్యాలు, నూనెగింజలు, పచ్చిరొట్ట ఎరువులు, తదితర వాటి గురించి భూమిలో వేసుకోవడం వల్ల భూసారం పెరుగుతోందని ప్రకృతి వ్యవసాయ అధికారులు తెలిపారు. ఎకరానికి 12 నుంచి 15 కేజీల వరకు 30 రకాల విత్తనాలు భూమిలో చల్లుకోవాల్సిందిగా ఎంటీ వీరాలక్ష్మి, ఎస్‌డీఏ అనమణి తెలిపారు. ఈసందర్భంగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌సీహెచ్‌జీ మెంబర్స్ తిరుపతిరావు, ఎల్.రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి రత్నకుమార్



తాడేపల్లి రూరల్: మహిళలు అన్ని విషయాల్లో ధైర్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావాలని సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నకుమార్ అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని డొలాస్ నగర్ గుడ్‌షెపర్డ్ కాన్వెంట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ మహిళలు పెట్టినటువంటి చాలా కేసుల్లో సరియైన సాక్ష్యాధారాలు లేకపోవడం వలన కేసులు నీరుగారిపోతున్నాయని వివరించారు. ముఖ్యంగా గృహహింస చట్టం, మనోవర్తి చట్టం, నిర్భయ చట్టాలపై ప్రతి ప్రతి ఒక్క మహిళకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమానికి ఐద్వా గుంటూరు జిల్లా అధ్యక్షురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, సీనియర్ అడ్వకేట్ శ్యామల, సీడీపీఓ సరిత, సిస్టర్స్ ఊర్మిళ, ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

ఈమని గ్రంథాలయం పునఃప్రారంభం

ఈమని(తాడేపల్లి రూరల్): నియోజకవర్గ పరిధిలోని దుగ్గిరాల మండలం ఈమని గ్రంథాలయాన్ని విలేజి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పునః ప్రారంభించారు. ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాలయాన్ని ప్రారంభించి పలు జాతీయ నాయకుల చిత్ర పటాలను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాన్ని విలేజి కమిటీ ఫోరం కన్వీనర్ ఇందుపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పునః ప్రారంభించడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. గ్రామంలో గ్రంథాలయం ఉండటం వల్ల ఎంతో మందికి ఉపయోగంగా ఉంటుందని, మన చరిత్ర మన పౌరులకు తెలియాలంటే ఇలాంటి గ్రంథాలయాలు ఉండాలని చెప్పారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అవసరమైన సౌకర్యాలను కూడా కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె హామీనిచ్చారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీవాణి, పసుపులేటి సాయి చైతన్య, ఎంపీటీసీలు గోరె బుల్లెమ్మ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఏడు కొండలు పాల్గొన్నారు.

సావిత్రీ బాయి పూలేకు ఘన నివాళి



మంగళగిరి: మహిళల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన సావిత్రీ బాయి పూలే అని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. స్థానిక ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో పూలే వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు సంకె సునీత, నాయకులు వ్యాసం అజయ్, నాసిర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ కార్యాలయంలో...

నగరంలోని పార్కు రోడ్‌లోని ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్స్ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు సంఘాల నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కారుమంచి రామారావు, కంచర్ల కాశయ్య పాల్గొన్నారు.

మార్చి 31 నాటికి పనులు పూర్తి చేయాలి



ప్రాతూరులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంటీఎంసీ డీఈ కృష్ణారెడ్డి

తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని డీఈ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు, కొలనుకొండ, వడ్డేశ్వరం, ఉండవల్లి, పెనుమాక, ఆత్మకూరు, నవులూరు, తదితర ప్రాంతాల్లో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, జరుగుతున్న పనులను గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతి రోజూ పరిశీలించి నివేదిక అందజేయాలని చెప్పారు. దాదాపుగా ఈనెల 1వ తేదీ నుంచి 14,15వ ఆర్థిక సంఘం నిధులతో 35 అభివృద్ధి పనులు చేపట్టగా ఇప్పటికే 12 పనులను పూర్తి చేశామని, మిగిలిన అభివృద్ధి పనులు కూడా మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేసేలా అన్ని చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కిషోర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

డీఈ కృష్ణారెడ్డి

వాటర్ ప్లాంట్ స్థల పరిశీలన...

తాడేపల్లి రూరల్ పరిధిలోని ఏఐఐబీ సంస్థ 75 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న వాటర్ ప్లాంట్‌ను ఉండవల్లిలో నిర్మించనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏఐఐబీ ప్రతినిధులతో నగరపాలక సంస్థ అధికారులు కలసి ఉండవల్లిలో దేవదాయ శాఖ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ కార్పొరేషన్ వ్యాప్తంగా కృష్ణాజలాలను అందించేందుకు ఏఐఐబీ బ్యాంక్ సహకారంతో పైపులైన్ నిర్మాణం చేపట్టామని, కృష్ణానది నుంచి రావాటర్ తీసుకుని ఫిల్టర్ చేసేందుకు ఐదెకరాల స్థలం కావాల్సి ఉందన్నారు. అందుకు అవసరమైన స్థలం కృష్ణానదికి అతి సమీపంలో ఉన్న ఉండవల్లిలో పరిశీలించామని, ఈ స్థలాన్ని కార్పొరేషన్‌కు తాగునీటిని అందించేందుకు, అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు అనుకూలంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈలు కృష్ణారెడ్డి, రషీద్, ఏఈలు ప్రవీణ్, కిషోర్ పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల చోరీ

మంగళగిరి: నగర పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాలు.. నిడమర్రు రోడ్డులో తోట ప్రకాష్, ద్విచక్ర వాహనాన్ని ఆపి తాళం వాహనానికే ఉంచి న్యూడిల్స్ తిని వచ్చే లోపు వాహనం మాయమైంది. అదే విధంగా తోట సుబ్రహ్మణ్యం షాపింగ్ మాల్ వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి తిరిగి వచ్చే సరికి వాహనం మాయమైంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు..

నగర పరిధిలో శుక్రవారం మూడు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆర్ అండ్‌బీ బంగ్లా వద్ద కారు, ఆటో ఢీ కొనగా వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. జాతీయ రహదారిపై కారు – టెంపో ఆటో ఢీకొన్న ఘటనలో వాహనాలు దెబ్బతిన్నాయి. నగరంలోని రత్నాల చెరువు సర్వీసు రోడ్డులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనగా ఒక ద్విచక్ర వాహనదారుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత..

నగర పరిధిలోని తెనాలి ఫ్లైఓవర్‌పై ఆటోలో అక్రమంగా తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పట్టుబడిన షేక్ ఖలీల్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి



కొలనుకొండ - వడ్డేశ్వరం మధ్య నిర్మించిన సిమెంట్ రోడ్డు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం– కొలనుకొండ పంట పొలాల మధ్య ఎంటీఎంసీ అధికారులు మరో సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని శనివారం పూర్తి చేశారు. ఇటీవల ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) వడ్డేశ్వరం, కొలనుకొండ పర్యటించిన సందర్భంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కొలనుకొండ– వడ్డేశ్వరం డొంక రోడ్డును సిమెంట్ రోడ్డుగా చేయడం వల్ల యూనివర్సిటీ విద్యార్థులకు చాలా ఉపయోగంగా ఉంటుందని, గ్రామంలో ప్రమాదాలను నివారించవచ్చునని విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే ఆర్కే ఎంటీఎంసీ అధికారులతో మాట్లాడి రూ.30 లక్షలను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కేటాయించి రోడ్డు నిర్మాణం చేయాలని సూచించారు. గత శుక్రవారం నుంచి ప్రారంభమైన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు నిత్యం సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పర్యవేక్షిస్తూ వారం రోజుల్లో కీ వాల్ నిర్మాణం 245 మీటర్ల పొడవు, 3.6 మీటర్ల వెడల్పున రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఎంటీఎంసీ డీఈ కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ సిబ్బందిని అభినందించారు.

చిరు ధాన్యాల సాగుపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, సిబ్బంది

ఫిరంగిపురం: భూమిని ఖాళీగా ఉంచుకోకుండా 30 రకాల విత్తనాలతో రైతులు సాగు చేపట్టాలని రైతు సాధికారత సంస్థ డీఆర్పీ ఎంటీ మస్తాన్‌వలి అన్నారు. మండలంలోని మునగపాడులో శుక్రవారం రైతులకు రబీ పంటలు వేసే విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పప్పు ధాన్యాల సాగు వంటి వాటిపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌డీఏ అన్నామణి మాట్లాడుతూ 30 రకాల్లో పప్పుజాతి, నూనెజాతి, గడ్డిజాతి, సుగంధ ద్రవ్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతి, తీగజాతి వంటివి వేసుకోవడం ద్వారా అన్ని రకాల పోషకాలు భూమికి అంది భూమి సారవంతంగా మారుతుందని చెప్పారు. ఒక ఆవుమూత్రం, పేడద్వారా 30 ఎకరాలు సాగుచేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంటీ వీరలక్ష్మి, ఐసీఆర్పీలు వెంకటేశ్వరావు, ఎస్.ప్రభావతి, రైతులు రమణయ్య, షేక్ అబ్దుల్లా, సత్తార్, గోపి పాల్గొన్నారు.

ఉగాది బాలోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: విద్యార్థులకు ఒత్తిడి లేని సమాజాన్ని నిర్మించేందుకు అందరం కలసి కృషి చేద్దామని కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్(క్యాబ్) అధ్యక్షులు బీఎస్‌ఆర్ మోహనరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని నవోదయ కాలనీలో శుక్రవారం ఉగాది బాలోత్సవం బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలోత్సవం నిర్వాహకులు కొట్టి కరుణాకరరావు, ప్రతినిధులు వై.సుబ్బారావు, రామచంద్రరావు, జగన్మోహనరావు, నాగరాజు, రియాజ్ బాషా, వి.వెంకటేష్, టి.శ్రీలక్ష్మి, వై.బర్నబాస్, జి.అవినాష్ రెడ్డి, బిట్రా రామారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను శిక్షించడం తగదు: యూటీఎఫ్

గుంటూరు ఎడ్యుకేషన్: వ్యవస్థలో లోపాలకు ఉపాధ్యాయుల్ని శిక్షించడం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల్ని సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి, కళాధర్ మాట్లాడుతూ బోధన సజావుగా సాగకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయని, వాటిని వదిలేసి కేవలం ఉపాధ్యాయుడిని బాధ్యుడిని చేసి, సస్పెండ్ చేయడం కక్ష సాధింపు చర్యగా ఉందని ఆరోపించారు. ప్రదర్శనలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, ఏ.ఎల్.శివపార్వతి, జిల్లా కార్యదర్శులు సీహెచ్. ఆదినారాయణ, కె.సాంబశివరావు, ఎండీ.షకీలాబేగం, ఎం. గురుబ్రహ్మం, కె.రంగారావు, కోటిరెడ్డి, బి.ప్రసాద్, కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో మతీన్‌కు రజత పతకం

గుంటూరు ఎడ్యుకేషన్: జమ్మూ కశ్మీర్‌లో ఇటీవల జరిగిన ఫెడరేషన్ కప్ ఎక్విప్‌డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 2022–23లో ఆంధ్ర ముస్లిం జూనియర్ కళాశాల విద్యార్థి షేక్ అబ్దుల్ మతీన్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ షమీమ్ బేగం తెలిపారు. పొన్నూరు రోడ్డులోని కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అబ్దుల్ మతీన్‌ను అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ షేక్ సుభాని, అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్ నగదు పురస్కారాన్ని అందజేశారు. ఏషియన్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించడంపై అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి, కళాశాల ఖ్యాతిని ఇనుమడింపచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వెలగపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

తాడికొండ: తుళ్లూరు మండలం వెలగపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం శనివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

తాడికొండ ఇన్‌చార్జి సీఐగా శేషగిరిరావు

తాడికొండ: ఇన్‌చార్జి సీఐ శేషగిరిరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ జి.శ్రీనివాసరావును గతంలో పనిచేస్తున్న ప్రాంతంలో ఉన్న ఆరోపణల నేపథ్యంలో రెండు రోజుల క్రితం వీఆర్‌కు బదిలీ చేశారు. తుళ్ళూరు సీఐ–2గా పనిచేస్తున్న శేషగిరిరావు నూతన సీఐ విధులలో చేరేంత వరకు సీఐగా కొనసాగనున్నారు.

చలివేంద్రం ప్రారంభం

లాం(తాడికొండ): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి చలివేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలని లాం గ్రామ సర్పంచి అబీదా అలీ తెలిపారు. గ్రామంలో బొబ్బేపల్లి ఇబ్రహీం మరియు మోమిన్‌ల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కూలింగ్ చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి వి.రవికుమార్, వీఆర్వో వేణుబాబు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



మంగళగిరి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని శ్రీ సౌజన్య వృద్ధాశ్రమంలో బీసీ వెల్ఫేర్ జేఏసీ మహిళా విభాగం ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జేఏసీ మహిళా విభాగం ప్రతినిధులు ఆర్.నాగేశ్వరి, బి.లక్ష్మి, సీహెచ్ శ్రీదేవి, కె.ఉమారాణి పాల్గొన్నారు.

వెంచర్లలో దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తులు అరెస్ట్



తాడికొండ: ప్రైవేటు వెంచర్లు, జగనన్న కాలనీలలో విద్యుత్ వైర్లు, ఎలక్ట్రికల్ కండక్టర్లు దొంగతనాలు చేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు. శుక్రవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ దొంగలపై నిఘా ఏర్పాటు చేయగా 9వ తేదీ రాత్రి తాడికొండ అడ్డరోడ్డు వద్ద తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన పూజాల నాగబాబు, గంగవరపు శ్రీనివాసరావు, గాలి వెంకటేశ్వర్లు, మర్రి శివ శంకరరావులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద ఉన్న కొద్దిపాటి సొత్తును రికవరీ చేసుకొని రిమాండ్‌కు పంపించడం జరిగిందన్నారు.

వేలం పాటలో షాపు కేటాయింపు

గుంటూరు ఈస్ట్: నాజ్ సెంటర్‌లోని నూనె నరసింహం ధర్మసత్రంలోని ఓ షాపును వేలం పాటలో అద్దెదారుడు దక్కించుకున్నట్లు ఈవో వెంకట కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు రూ. లక్ష అద్దె చెల్లించే విధంగా జగదీశ్వరరెడ్డి షాపు దక్కించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

తాడికొండ: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడికొండ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ ఎంబీడీ శ్యామల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 23న విద్యార్థులు కామన్ టాలెంట్ ఎంట్రన్స్ పరీక్ష రాయాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్ష ఎక్కడ రాసినా ప్రాధాన్యతా క్రమంలో సీట్లు కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులు 2010 సెప్టెంబర్ 01 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి, ఓసీ, బీసీ, కన్వర్టెడ్ క్రిస్టియన్ విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. విద్యార్థులు సొంత జిల్లాలో 2021–22 ఏడాదిలో 3వ తరగతి, 2022–23లో 4వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలలో చదివి ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష దాటరాదని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- నిడుముక్కలలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

నిడుముక్కల(తాడికొండ): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకు వస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ కులం, మతం, పార్టీ, ప్రాంతం భేదాలు లేకుండా ప్రజలకు ప్రభుత్వ సేవలను సమానంగా అందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను, వలంటీర్‌లను అందుబాటులోకి తీసుకొచ్చిన జగనన్న పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మాదాసు రత్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గుడిమెట్ల జ్యోతి, ఎంపీటీసీ బోడపాటి సుశీల, మాజీ ఎంపీపీలు కొమ్మినేని రామచంద్రరావు, మండల జేసీఎస్ అధ్యక్షుడు తాళ్ల శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు బోడపాటి ధర్మరాజు, బాకి వెంకటస్వామి, మాజీ ఉప సర్పంచులు మాదాసు ఏసురత్నం, గుంటి రఘువరన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ దాములూరి రాము, తాళ్ల శివనాగరాజు, ఉయ్యూరు వెంకటరెడ్డి, అత్తోట అక్కయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కి, చిర్రావూరు, రామచంద్రాపురంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కాజ, చినకాకాని పరిసర ప్రాంతాల్లో ఉదయం 9.30 లనుంచి మధ్యాహ్నం 12.30 వరకు పెదవడ్లపూడి పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నులకపేట సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

నులకపేట, ఇండస్ట్రియల్ కాలనీ, శివదుర్గాపురం, బాబూజగ్జీవనరామ్ కాలనీ, లెనిన్ కాలనీ, ఇస్లాంపేట, ప్రకాష్ నగర్, జీఎంసీ కాలనీ, ఓల్డ్ పంచాయతీ కార్యాలయం ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడికొండ: వార్షిక మరమ్మతులలో భాగంగా తుళ్లూరు మండలంలోని రాయపూడి, అనంతవరం ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా శనివారం నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈఈ చిలకరాజు తెలిపారు. సంబంధిత గ్రామాల వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి సహకరించాలని ఒక ప్రకటనలో కోరారు.

గ్రామ సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



పాలడుగులో గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

మేడికొండూరు: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించడంతో పాటు, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఆదేశించారు. మండలంలోని పాలడుగు గ్రామంలోని సచివాలయంలో ప్రతిరోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ, నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరు వంశీకృష్ణ, ఎంపీడీఓ శోభరాణి, ఈఓపీఆర్డీ రవికుమార్, మన్నవ రాజేష్, బొడ్డు చినసాంబయ్య, తూమాటి మురళి, భారతి పాల్గొన్నారు.

రక్తహీనతతో అనారోగ్యం

ఫిరంగిపురం: రక్తహీనతతో అనారోగ్యం పాలవుతారని ఎంపీడీఓ డి.అనూరాధ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ఎంలకు నులిపురుగుల నివారణపై, మింగించే మాత్రలు గురించి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అనూరాధ మాట్లాడుతూ 14వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు భోజనం చేసిన తరువాత నులిపురుగునివారణ మాత్రలు ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీలు మింగించాలని చెప్పారు. వైద్యాధికారి యానీగ్రేస్ మాట్లాడుతూ నులిపురుగుల నుంచి రక్షించుకోవాలంటే భోజనానికి ముందు విద్యార్థులు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, అనారోగ్యం, జ్వరం, వాంతులు, విరోచనాలు ఉన్న వారు ఆల్బెండాజోల్ మాత్రలు వేసుకోకూడదని చెప్పారు. అనంతరం ఏఎన్ఎంలకు ఆల్బెండాజోల్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటలక్ష్మి, ఎంపీహెచ్ఈఓ లూర్దురాజు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులపై కేసులు ఎత్తివేయాలని వినతి

మేడికొండూరు: నాయీబ్రాహ్మణులపై కేసులు ఎత్తివేయాలని ఏపీ నాయీబ్రాహ్మణ జేఏసీ నాయకులు తాడికొండ నరసింహారావు విన్నవించారు. పేరేచర్ల గ్రామంలో హరినాథ్‌బాబు కుటుంబపై దాడి చేసి కేసులు బనాయించిన బి.రామాంజనేయులు, ఆదినారాయణపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ శుక్రవారం సీఐ వాసును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం తహసీల్దారు కరుణకుమార్ నిజ నిర్ధారణ కమిటి వేసి నిజాన్ని నిర్ధారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల వీరాస్వామి, నాయీబ్రాహ్మణ జేఏసీ గుంటూరు నగర కన్వీనర్ తాళ్లూరి శ్రీను, మున్నంగి సుబ్బారావు, మంచాల జోసఫ్ పాల్గొన్నారు.